# గాయపడిన సముద్రం

జి.ఆర్.మహర్షి

అ తడూ - ఆమె - సముద్రం వాళ్లిద్దరూ మౌనంగా వున్నారు. సముద్రం మాత్రం ఘోషిస్తూ ఉంది. అతడు ఇసుకలో బొమ్మలు గీస్తూ వున్నాడు. ఆమె సముద్రాన్ని చూస్తూ వుంది. తీవ్రమైన ఆగ్రహంతో ఒక అల వచ్చింది. ఆమె దగ్గరికి వచ్చేసరికి పసిపాపలా మారిపోయింది. కాళ్లను పెనవేసుకొని వెళ్లిపోయింది.



ఆమె మాట్లాడ్డానికి ప్రయత్నించింది.

పెదవులు వణికాయి. ఒక్కోమాటనూ పేర్చుకుంది.

"నా పెళ్లి నిశ్చయమయ్యింది" - ఆమె గుండెల్లో కల్లోల సముద్రం.

అతను ఏమీ మాట్లాడలేదు. దూరంగా కదిలే పడవల వైపు చూస్తూ వుండిపోయాడు.

"ఏమైనా మాట్లాడు"

"నేను నీకు మంచిజీవితాన్ని ఇవ్వలేను" నిదానంగా అన్నాడు.

"ఏదైనా ఉద్యోగం చూసుకోకూడదా?" ఆమె గొంతులో మిణుక్కుమిణుక్కుమంటున్న ఆశ.

అతను మౌనంగా వున్నాడు.

కాసేపటి తర్వాత "నేను వెళుతున్నాను" అని లేచింది ఆమె.

వెళుతూ ఒక్కక్షణం ఆగి "నువ్వు బతకడం చేతగాని అసమర్థుడివి" అంది.

"నాకు తెలుసు" అన్నాడు.

ఆమె వెళ్లిపోయింది.

అతని కళ్లలో సముద్రం ప్రతిబింబించింది.

ఒక కన్నీటి చుక్క జారి పెదవికి ఉప్పగా తగిలింది.

శిథిలనౌకలా, సముద్రపు ఒడ్డున కూర్చుండిపోయాడు.

* * *

"పనీపాటా లేదు. ఎప్పుడు చూసినా పేపర్లమీద బొమ్మలు వేస్తూ కూర్చోడం. బొమ్మలు అన్నం పెడతాయా?"

వదిన గొణుగుతూ వుంది.

అతనికిది అలవాటే.

"అన్నమీద ఆధారపడి బతకడం గొప్పేంకాదు. కష్టపడి సంపాదిస్తే తెలుస్తుంది."

తింటున్న అన్నంలో చెయ్యి కడిగేసి, బయటికి వెళ్ళిపోయాడు.

సముద్రం దగ్గరికి వచ్చి కూర్చున్నాడు.

సముద్రపుహోరు ఓదార్పుగీతంలా వుంది.

నీలిఆకాశంలో నక్షత్రాల్లాగా, సముద్రంలో అక్కడక్కడ పడవల దీపాలు కనిపిస్తున్నాయి.

ఇసుకను చేతిలోకి తీసుకున్నాడు.

ఒక గవ్వ దొరికింది.

గుడ్డిగవ్వ విలువకూడా చేయవు. వదిన మాటలు గుర్తుకొచ్చాయి.

గవ్వను చెవి దగ్గర పెట్టుకున్నాడు.

గాలి ఏడుస్తున్న శబ్దం - ఏదో దుఃఖాన్ని చెప్పుకునే ప్రయత్నం.

వదిన ఎందుకట్లా మాట్లాడుతుంది. ఆర్థిక నిస్సహాయత వల్ల మనుషులు కర్కశంగాప్రవర్తిస్తారు. అన్నయ్యదిచాలీచాలని జీతంతానొకఅదనపు బరువు. బొమ్మలు గీయడంతప్ప,తనకు మరోపని చేతకాదు. బొమ్మలుగీస్తే డబ్బులు రావు శైలూతో కలిసి ఎన్నోసార్లు ఇక్కడే కూచున్నాడు. ఇద్దరి మధ్య కబుర్ల జలపాతాలు.

శైలూ బొమ్మని మొదటిసారి తాను గీసిన రోజు - ఆమె కళ్లు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

అలలమీది పడవల్లా - ఆ కళ్లు అల్లాడాయి.

తనను లాలించిన కళ్లు!

శాసించిన కళ్లు!

ఏడిపిస్తున్న కళ్లు!

యవ్వనం ఒక వరం - దారిద్ర్యం శాపం.

సముద్రం స్మృతుల్ని మిగలనివ్వదు. అన్నింటిని తనలో కలిపేసుకుంటుంది.

బాల్యం ఒక అలలా కదిలింది.

తల్లి చితిమంటల ముందు వెక్కుతున్న చిన్నకుర్రాడు - ఓదారుస్తున్న తండ్రి.

ఏవేవో దృశ్యాలు మసగ్గా కరిగిపోతున్నాయి.

తనుగీసిన అమ్మబొమ్మని చెదలు తినేయడం గుర్తొచ్చింది.

నాన్నవేలు పట్టుకుని, సముద్రపు ఒడ్డుకి షికారు రావడం జ్ఞాపకమొచ్చింది.

పేపర్‌మీద పెన్సిల్‌తో ఏవేవో గీతలు - తన బొమ్మల్ని చూసినప్పుడల్లా నాన్న కళ్లల్లో ఆనందం.

ఒకరోజు

నాన్నతో సముద్రం దగ్గరికి వచ్చాడు.

ఇసుకలో ఇద్దరూ ఆడుకున్నారు.

నాన్నకూడా పసిబిడ్డే!

తాను అలిసిపోయి ఇసుకలో కూర్చున్నాడు.

నాన్నవెళ్లి కెరటాలను అల్లరిపెట్టసాగాడు.

**"ఇది వ్యాపారం, అవతలి వాడు సగం చూపిస్తే, మనం పూర్తిగా చూపాలి"**

**బొమ్మకి బట్టలూడదీస్తున్నప్పుడు అతని చేతులు వణికాయి. ఎవరినో హత్య చేస్తున్న భావన.**



కెరటాలకుకోపమొచ్చింది. నాన్నమతమతోతీసుకెళ్లాయి మళ్లీ ఇవ్వలేదు. సముద్రాన్ని చూస్తేనాన్నని చూసి నట్టే వుంటుంది. దుఃఖంతో ఎన్నో బొమ్మలు గీసాడు. మేష్టార్లు మెచ్చుకునేవారు పదవతరగతి తప్పాడు. అందరూ, ఈసడించుకున్నారు.

కిటికీలోంచి సముద్రం కనిపిస్తూవుంటే పరీక్షను ఎలా రాయగలడు?

"బొమ్మలు గీస్తే ఏమొస్తుంది చెప్పు: బతకడానికి ఏదైనా దారిచూసుకోవాలిగాని"చాలామందిసలహాలు.

ఒకసారి బొమ్మల పోటీలో బహుమతి వచ్చింది.

ప్రశంసిస్తూ ఒక సర్టిఫికెట్ ఇచ్చారు. అన్నయ్యకి తెచ్చి చూపించాడు.

"డబ్బులేమైనా ఇస్తారా?" అని అడిగాడు.

తాను సముద్రం దగ్గరికి వెళ్లి ఏడ్చాడు.

సముద్రం తన తల్లి!

* * *

ఇంటికొచ్చాడు.

"ఎక్కడికెళ్లావ్?" అన్నయ్య పలకరించాడు.

"సముద్రపు ఒడ్డుకి"

"అన్నంలో చెయ్యికడిగేశావట, మీ వదిన బాధపడింది."

అన్న కళ్లలోకి ఒకసారి చూసి మౌనంగా వుండిపోయాడు.

"నేను నీకో ఉద్యోగం చూశాను. సేట్ దుకాణంలో అకౌంట్స్ చూడాలి. ఎంతో బలిమాలితే ఒప్పుకున్నాడు. రేపు వెళ్లి చేరు. జీతం ఐదొందలు. పని బాగా చేస్తే వంద పెంచుతానన్నాడు. మాట్లాడవేం?"

"కొంచెం డబ్బుకావాలి."

"ఎందుకు?"

"డ్రాయింగ్ పేపర్లు కొనుక్కోవాలి"

"నీకు ఈ పిచ్చి వదలదన్నమాట"

* * *

సేట్ దుకాణం.

రకరకాల డబ్బుమాటలు.

"షేర్ల ధరలు ఇక కోలుకోవు."

"రాత్రి నాయుడిగారింట్లో పార్టీ. యాభైవేలు ఖర్చుపెట్టాడు."

"మీ ఫ్యాక్టరీలో యూనియన్ పెట్టారట!"

"అలగా నా కొడుకులు. నాకు కోపమొస్తే ఫ్యాక్టరీ మూసేస్తాను. తిండికి లేక చస్తారు. చెప్పడం మరిచా. మా అమ్మాయి ఒకటే పోరుతూ వుంటే నాలుగు కుక్కల్ని కొన్నాను. ఇరవై వేలయ్యింది."

"మా ఇంటి ముందు గార్డెన్‌కి యాభైవేలు ఖర్చయ్యింది."

అకౌంట్ పుస్తకాల్లోని అక్షరాలు అతనికి పురుగుల్లా కనిపిస్తున్నాయి.

కిటికీలోంచి బయటకి చూశాడు.

సూర్యాస్తమయం.

ఆకాశం చెట్టుకి కాచిన నారింజ పండు.

అలాగే చూస్తూ వుండిపోయాడు.

* * *

"నీలాంటి వారిని పనిలో పెట్టుకుంటే నెత్తిన గుడ్డేసుకుని పోవాల్సిందే. నీకు బుద్ధుందా? అకౌంట్ పుస్తకంలో బొమ్మలు గీస్తావా?" సేట్ కేకలు పెడుతున్నాడు.

"రేపట్నుంచి నువ్వు పనిలోకి రానక్కరలేదు."

అతను వెళ్లిపోయాడు.

* * *

రోజులు గడుస్తూవున్నాయి.

ఒకరోజు అతని అన్నయ్య సంతోషంగా ఇంటికొచ్చాడు.

"తమ్ముడూ, ఇంతకాలానికి నీకు తగిన ఉద్యోగం దొరికింది. వార్త పత్రికాఫీసులో ఆర్టిస్ట్ పని. బొమ్మలు గీయడం నీకు ఇష్టం కదా" అన్నాడు.

పత్రికాఫీసులో చేరాడు.

రీతిక శీర్షిక యువతకై ప్రత్యేకించిన శీర్షిక. యువ కవులు, కథకులు అనేకమంది తమ కథలకు, కవితలను 'ఆహ్వానం' పత్రికకు పంపుతున్నారు. వీరిని ప్రోత్సాహించేందుకై రీతిక శీర్షికలో క్రొత్త కవులకు, కథకులకు కొన్ని పేజీలు కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగించుకో దలచిన యువతరం తమ కథలను, కవితలను సామాజిక అవగాహన కొరవడకుండా సంక్షిప్తంగా రాసి పంపితే ప్రచురిస్తాం.

--ఎడిటర్

"ఈ కథ చదివి బొమ్మ గీయ్" అని చెప్పాడు ఎడిటర్.

బొమ్మ గీస్తూ వుంటే మనసంతా ఆనందంతో నిండిపోయింది.

బొమ్మను ఎడిటర్‌కి చూపించాడు.

ఎడిటర్ వింతగా చూశాడు.

"చూడు బాబూ! ఇప్పుడు సున్నితత్వం ఎవరికీ అవసరం లేదు. మొరటుతనం కావాలి. బొమ్మలకి శుభ్రంగా చీరకడితే లాభంలేదు" అన్నాడు.

గాయాలు అతనికి కొత్తకాదు.

కాని ఇది అతని ఆత్మకి తగిలింది.

"నిలబడతావేం వెళ్లు. ఇది వ్యాపారం. అవతలివాడు సగం చూపిస్తే, మనం పూర్తిగా చూపాలి."

బొమ్మకి బట్టలూడదీస్తున్నపుడు అతని చేతులు వణికాయి.

ఎవరినో హత్యచేస్తున్న భావన.

అటువంటి బొమ్మలు గీసిన ప్రతిసారీ గిలగిల్లాడిపోయాడు. తిండి సరిగ్గా తినడం మానేసాడు. నిద్రపట్టేదికాదు. పిచ్చిపిచ్చికలలొచ్చేవి. ఎవరిమీదనో కసి!

సముద్రమిప్పుడు ఒక ఉపశమనం కాదు.

అదొక జలరాక్షసి!

* * *

"ఈ మధ్య నీ బొమ్మల్లో స్పష్టత వుండటం లేదు" అన్నాడు ఎడిటర్.

"స్పష్టత అంటే స్తనాలను మరింత పెద్దవిగా వేయడమేగా!"

"పిచ్చిపిచ్చిగా మాట్లాడకు, మన పాలసీ గురించి ముందే నీకు చెప్పాను. ఆఫీసులో కూడా నీ ప్రవర్తనేం బాగాలేదు. ప్యూన్ ఏదో అంటే పేపర్ వెయిట్‌తో కొట్టబోయావట! చెప్పిన పని చేయడం నేర్చుకో. టాలెంట్ వున్నవాడివి కష్టపడితే పైకొస్తావు. వెళ్లి ఈ బొమ్మను మళ్లీ గీసుకురా."

కాసేపటి తర్వాత అతను ఒక కాగితం తీసుకొచ్చి ఎడిటర్ చేతికిచ్చాడు.

ఎడిటర్ వింతగా అతని వైపు చూసి "రాజీనామానా! మంచిది. నువ్వుపోతే నీలాంటివాళ్లు పదిమందొస్తారు. ఇంకోసారి ఆలోచించుకో"

"నేను వెళుతున్నాను"

"ఉద్యోగం లేకపోతే తిండికి మాడి చస్తావ్"

"రోజూ చావడం కంటే అదే మేలు"

* * *

అలసిపోయిన సూర్యున్ని సముద్రం తన కడుపులో దాచుకుంది. ఒక ఒంటరి పడవను, సముద్రం తన అరచేతిలో ఉయ్యాలలూపుతూ లాలిస్తూవుంది.

నిజానికి సముద్రమే, నిత్యం రోదించే ఒక నీటిపాప.

ఒక విషాదాంత నాటకం ముగిసిందన్నట్టుగా, చీకటి తెరలు నిశ్శబ్దంగా వాలుతున్నాయి.

అతనొక విషాదయోగిలా సముద్రం ముందుకూర్చొని వున్నాడు.

"తమ్ముడూ!" అని కేక వినిపించింది.

ఎదురుగా అన్నయ్య.

"ఎక్కడికెళ్లావ్ తమ్ముడూ! వారం రోజులుగా నీ కోసం వెదకని చోటంటూ లేదు. ప్రతిరోజూ సముద్రం దగ్గరికొచ్చి వెతికాను. ఇవాళ దొరికావు. ఇంటికెళదాం రా! నీకో శుభవార్త చెపుతాను. మూడురోజుల క్రితం ఒకాయన కారులో మనింటికొచ్చాడు. ఆకారు ఎంత పెద్దదంటే, మనిల్లంత వుందనుకో? నీ బొమ్మల గురించి అడిగాడు. అటక మీద వున్నవాటిని చూపించాను. ఆశ్చర్యపోయాడు. నువ్వు గొప్పవాడివని పొగిడాడు. నీ బొమ్మల్ని ఎగ్జిబిషన్‌లో పెడితే చాలా డబ్బులొస్తాయన్నాడు. ఆ బొమ్మలన్నింటిని తీసుకొని వెయ్యిరూపాయలిచ్చాడు. నిన్ను తీసుకురమ్మన్నాడు" ఆనందంగా చెప్పాడు అన్నయ్య.

తమ్ముడు మౌనంగా సముద్రం వైపు చూస్తుండిపోయాడు.

వెళదాం రాతమ్ముడూ" తమ్ముడి చెయ్యి పట్టుకోబోయాడు.

ఆ క్షణంలో

అన్న మెదడులో ఒక నిశ్శబ్ద విస్ఫోటనం

రక్తం గడ్డకట్టుకుపోయిన భావన.

సముద్రం కూడా ఊపిరి పీల్చడం మరిచిపోయింది.

"తమ్ముడూ నీ చెయ్యి " - అన్న వణకుతున్నాడు. ఏడుస్తున్నాడు.

"నరికేసుకున్నాను. ఇంకెప్పుడూ బొమ్మలు వేయరాదని"

తమ్ముడు ఒక దుఃఖనది ఐ సముద్రం ముందు కుప్పకూలి పోయాడు.

తన బిడ్డని ఓదార్చడానికి ఒక కెరటం ఆత్రంగా ఈదుకుంటూ ఒడ్డుకొచ్చింది. ●

